సాక్షి నల్లగొండ

గురువారం । 22 । మే । 2025



రాష్ట్రానికి అన్యాయం
గత పాలకుల తీరుతో కృష్ణా జలాల్లో తెలంగాణకు అన్యాయం జరిగిందని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. - 8లో



రక్తదాత తయారు కావాలి
రక్తాన్ని తయారు చేయలేమని, ఇంటికొక రక్తదాత తయారుకావాలని సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ అన్నారు. - 8లో

గరిష్టం/కనిష్టం
34°/25°

వాతావరణం
మేఘావృతమై ఉంటుంది. ఉరుములతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

వైటీపీఎస్ చీఫ్ ఇంజనీర్‌గా రమేష్‌బాబు



వైటీపీఎస్ చీఫ్ ఇంజనీర్ రమేష్‌బాబును సన్మానిస్తున్న ఉద్యోగులు, సిబ్బంది

మిర్యాలగూడ : దామరచర్ల మండలంలోని వీర్లపాలెంలో గల యాదాద్రి థర్మల్ పవర్‌ప్లాంట్ (వైటీపీఎస్) చీఫ్ ఇంజనీర్‌గా వి.రమేష్‌బాబు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా టీఆర్‌వీకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, జెన్‌కో కార్యదర్శి చారుగుండ్ల రమేష్ ఆధ్వర్యంలో పలువురు ఆయనను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా చీఫ్ ఇంజనీర్ రమేష్‌బాబు మాట్లాడుతూ వైటీపీఎస్‌లో నీటి సదుపాయం కల్పిస్తామని, వీరప్పగూడెం నుంచి వీర్లపాలెం వరకు సీసీ రోడ్డు నిర్మాణానికి కృషి చేస్తానని, కార్మికులకు సరిపడా మందులను అందుబాటులో ఉంచుతామని, రెండవ అంబులెన్స్‌ను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రామ్మోహన్‌రావు, శ్రీనివాస్‌రావు, విజయేందర్‌రావు తదితరులు ఉన్నారు.

మొక్కల పెంపకానికి ప్రత్యేక చర్యలు



తాటికల్‌లో గ్రామస్తులతో మాట్లాడుతున్న డీఆర్‌డీఓ శేఖర్‌రెడ్డి

నకిరేకల్ : నర్సరీలో మొక్కల పెంపకానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని డీఆర్‌డీఓ వై.శేఖర్‌రెడ్డి కోరారు. నకిరేకల్ మండలం తాటికల్ గ్రామలోని గ్రామపంచాయతీ నర్సరీని బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన నర్సరీ నిర్వహణ, వన మహోత్సవ యాక్షన్ ప్లాన్ వివరాలను తెలుసుకున్నారు. ఆయన వెంట ఎంపీడీఓ చంద్రశేఖర్, ఏపీఓ రమణయ్య తదితరులు ఉన్నారు.

రెండో దశ మిషన్ ఇంద్రధనస్సు ప్రారంభం



చిన్నారికి టీకా వేస్తున్న డీఎంహెచ్‌ఓ పుట్ల శ్రీనివాస్

కొండమల్లేపల్లి : కొండమల్లేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం రెండో దశ మిషన్ ఇంద్రధనస్సు కార్యక్రమాన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి పుట్ల శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాధి నిరోధక టీకా కార్యక్రమం మే 21 నుంచి 28వ తేదీ వరకు కొనసాగుతుందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆశ వర్కర్ల ద్వారా గర్భిణులకు, పదేళ్లలోపు వయస్సున్న పిల్లలకు వ్యాక్సిన్ ఇస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉప వైద్యాధికారి కల్యాణ్ చక్రవర్తి, కేశ రవి, ప్రోగ్రాం అధికారులు ఎస్.పద్మ, కృష్ణకుమారి, డీపీఓ విష్ణు, డీవీఎల్ఎం జి.రాము, ఉదయ్, వైద్యాధికారి ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్‌లో రాణించాలి



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న కార్యదర్శి అమీనొద్దీన్

నల్లగొండ టూటౌన్ : క్రీడాకారులు క్రికెట్‌లో రాణించాలని క్రికెట్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి సయ్యద్ అమీనొద్దీన్ కోరారు. నల్లగొండ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని ఔట్‌డోర్ స్టేడియంలో ఇంట్రా ఉమ్మడి జిల్లా లీగ్ మ్యాచ్ పోటీలను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడాకారులు లీగ్ మ్యాచ్ పోటీలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. దీని ఆధారంగానే త్వరలో హెచ్‌సీఏ ఆధ్వర్యంలో నిర్వహించనున్న అంతర్ జిల్లా టోర్నమెంట్‌కు ఎంపిక చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు సయ్యద్ సఫియొద్దీన్, సతీష్, విశ్వనాథ్, బుచ్చిబాబు తదితరులు పాల్గొన్నారు.

● వక్ఫ్ చట్ట సవరణను వ్యతిరేకిస్తూ..



వక్ఫ్ చట్టం సవరణ బిల్లుకు వ్యతిరేకంగా ఆలిండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు ఆధ్వర్యంలో నల్లగొండలోని క్లాక్ టవర్ సెంటర్‌లో బుధవారం రాత్రి బహిరంగ సభ నిర్వహించారు. ఈ సభకు ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్రం తీసుకొచ్చిన వక్ఫ్ చట్ట సవరణ బిల్లు వల్ల దేశంలో మతాల మధ్య వైశమ్యాలు పెరుగుతాయన్నారు. దీనిపై కేంద్ర ప్రభుత్వం పునరాలోచన చేయాలని.. లేని పక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు.

- రామగిరి(నల్లగొండ)



భారీ వర్షానికి తిరుమలగిరిలో పొంగిపొర్లుతున్న బంధం

కాసులిస్తేనే కేబుల్!

- కేబుల్, కండక్టర్ వైరు పంపిణీలో నిబంధనలు పాటించని విద్యుత్‌శాఖ
- సీరియల్ తప్పించి ఇష్టానుసారంగా అప్పగింత
- 2020లో మంజూరైన రైతులను వదిలేసి 2025 వారికి ఇచ్చిన స్టోర్ అధికారులు
- ముడుపులు ఇచ్చే వారికే ముట్టజెపుతున్నారని ఆరోపణలు



నల్లగొండ : విద్యుత్ శాఖలో అధికారులు నిబంధనలకు నీళ్ల వదులుతున్నారు. వ్యవసాయ కనెక్షన్లకు సంబందించి కేబుల్, కండక్టర్ వైర్ల పంపిణీలో మాయాజాలం ప్రదర్శిస్తున్నారు. ముందుగా మంజూరైన రైతులను వదిలేసి.. ఇటీవల మంజూరైన వారికి కేబుల్, కండక్టర్ వైర్లను అప్పగిస్తున్నారు. ముడుపులకు ఆశపడి సీరియల్‌ను పక్కన పెట్టి ఇష్టానుసారంగా పంపిణీ చేస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడం వల్లే స్టోర్‌లో అధికారులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని తెలుస్తోంది.

2020 నుంచి రెండు వేల ఎస్టిమేట్లు పెండింగ్..

విద్యుత్ శాఖ నుంచి వ్యవసాయ కనెక్షన్ తీసుకున్న రైతులకు కండక్టర్ వైరు (సబ్‌స్టేషన్ నుంచి ట్రాన్స్‌ఫార్మర్‌కు వచ్చేది), కేబుల్‌వైరు (ట్రాన్స్‌ఫార్మర్ నుంచి రైతు బావి, బోరు వరకు స్తంభాల మధ్య లాగేది) ఇస్తుంది. రైతులు తమ వ్యవసాయ కనెక్షన్లకు దరఖాస్తు చేసుకున్న సందర్భంలో ఆ దూరాన్ని బట్టి కేబుల్ వైర్, అవసరాన్ని బట్టి కండక్టర్ వైర్‌ను విద్యుత్ శాఖ సరఫరా చేయాల్సి ఉంటుంది. 2020 నుంచి దరఖాస్తు చేసుకున్న రైతులకు వారి ఎస్టిమేట్ల ఆధారంగా విద్యుత్ శాఖ మంజూరు చేస్తూ వచ్చింది. 2020 నుంచి 2025 వరకు దాదాపు 2 వేల ఎస్టిమేట్ల వరకు రైతులకు కేబుల్, కండక్టర్ వైరు పెండింగ్‌లో ఉంది. ఇటీవల ప్రభుత్వం పెద్ద మొత్తంలో కేబుల్, కండక్టర్ వైర్లను విడుదల చేసింది. అయితే మొదట మంజూరైన రైతులకు కాకుండా.. వెనుకాల మంజూరైన రైతులకు వైర్లను ఇస్తూ అధికారులు చేతివాటం ప్రదర్శిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

మధ్యలో కొందరిని తప్పించి..

2020 జూన్ నెల నుంచి కేబుల్, కండక్టర్ వైర్లు మంజూరైనా పంపిణీ చేయలేదు. ఇటీవల ప్రభుత్వం నుంచి వైర్లు రావడంతో నల్లగొండ జిల్లా కేంద్రంలోని విద్యుత్ అధికారులు స్టోర్ పంపిణీ ప్రారంభించారు. మొదట 2023 జూలైలో దరఖాస్తు చేసుకున్న ఒకరికి 250 మీటర్ల వరకు వైర్ ఇచ్చారు. ఆ రైతు కంటే ముందు దాదాపు 250 మంది వరకు రైతులు ఉన్నారు. వారికి ఇవ్వకుండా వెనుకాల మంజూరైన రైతుకు ఇచ్చారు. ఆ తర్వాత మధ్యలో చాలా మందిని వదిలేసి 2024 మార్చిలో మంజూరైన రైతుకు 100 మీటర్లు ఇచ్చారు. ఇలా 2020 నుంచి 2025 మే 2వ వారం వరకు మధ్య చాలా మంది రైతులను వదిలేసి వెనుక మంజూరైన వారికి కేబుల్, కండక్టర్ వైరు ఇచ్చారు.

ముడుపులు ఇచ్చిన వారికేనా!

ముడుపులు ఇచ్చిన వారికే స్టోర్ నుంచి కేబుల్, కండక్టర్ వైర్ అప్పగించారన్న ఆరోపణలు ఉన్నాయి. మంజూరైన రైతులకు సీరియల్ ప్రకారం ఇవ్వకపోవడం అనుమానాలకు తావిస్తోంది. ఈ విషయంలో స్టోర్ అధికారుల చేతివాటం ప్రదర్శించారనే విషయం స్పష్టమవుతోంది. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడం వల్ల స్టోర్ అధికారుల వ్యవహారం ఆడిందే ఆట పాడిందే పాట అన్న చందంగా తయారైందని పలువురు అంటున్నారు. ఈ విషయంలో ఉన్నతాధికారులు దృష్టి సారించి ముందుగా మంజూరైన రైతులకు కేబుల్, కండక్టర్ వైర్లను ఇవ్వాల్సిన అవసరం ఉంది.

పొరపాటు జరిగితే సరిచేస్తాం

కేబుల్, కండక్టర్ వైర్ల బాధ్యత డీఈ, ఏఈలకు అప్పగించా. జిల్లాలో 38 విద్యుత్ సెక్షన్లు ఉన్నాయి. సెక్షన్‌కు 3 కిలో మీటర్ల చొప్పున అందరికీ సీనియార్టీ ప్రకారం ఇవ్వాలని చెప్పాం. డీఈలు, ఏఈలు చెప్పిన విధంగా మెటీరియల్ ఇవ్వాలని సూచించారు. ముందు మంజూరైన రైతులకు కాకుండా వెనుక మంజూరైన రైతులకు ఇవ్వడం కరెక్ట్ కాదు. ఈ విషయం నా దృష్టికి రాలేదు. దీనిపై విచారణ జరిపి ముందు మంజూరైన రైతులకు వైరు ఇస్తాం.

- ఎస్ఈ వెంకటేశ్వర్లు

అంతటా వర్షం.. ఉపశమనం

- తిరుమలగిరి సాగర్‌లో అత్యధికంగా 76.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు

నల్లగొండ, తిరుమలగిరి(నాగార్జునసాగర్) : జిల్లా వ్యాప్తంగా బుధవారం ఈదురుగాలులు, ఉరుములు మెరుపులతో కూడిన అకాల వర్షం కురిసింది. ఇప్పటివరకు వేసవి కాలం ఎండలతో అల్లాడిన ప్రజలు వర్షంతో ఒక్కసారిగా ఉపశమనం పొందారు. బుధవారం ఉదయం నుంచే ఆకాశం మేఘావృతమైంది. మధ్యాహ్నం వేళ జిల్లా అంతటా మోస్తరు వర్షం కురిసింది. జిల్లాలో అత్యధికంగా తిరుమలగిరి సాగర్ మండంలో 76.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఆ తర్వాత నకిరేకల్‌లో 60 మిల్లీమీటర్లు, పులిచెర్లలో 57.8, ఐటిపాములలో 47.5, అంగడిపేట, 38.8, కేతేపల్లి 37,8, నార్కట్‌పల్లి 37, హాలియా 32.5, కనగల్ 31.8, ఇబ్రహీంపేట, 30.8, రేగులగడ్డ, తుమ్మడం 26,8 ఉరుమడ్ల 24, పజ్జూరు 20.3, నెమ్మాని 19, నిడమనూర్ 18.5, గూడపూరు 17, తిమ్మాపూర్ 15,8, వెలుగుపలి కట్టంగూర్, నల్లగొండ, దామరచర్ల, గుర్రంపోడ్ ప్రాంతాల్లో 15 మిల్లీ మీటర్ల నుంచి 3 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది.

తిరుమలగిరిలో నిలిచిన రాకపోకలు

వర్షం కారణంగా తిరుమలగిరి మండల కేంద్రం సమీపంలోని రాజవరం రోడ్డుపై ఉన్న బంధం పైనుంచి భారీగా వరద ప్రవహించింది. సుమారు మూడు గంటలకుపైగా అక్కడి నుంచి వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. పొలాల్లో వర్షం నీరు చేరడంతో చెరువులను తలపించాయి. అక్కడక్కడా కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసిపోయింది. పిడుగుపాటుకు నల్లగొండ మండలం అప్పాజీపేటలో మహిళా రైతు మృతిచెందింది. పెద్ద అడిశర్లపల్లి మండలం పెద్దగట్టులో రెండు ఆవులు, కట్టంగూర్ మండలంలో కురుమర్తిలో రెండు పాడి గేదెలు మృత్యువాత పడ్డాయి.



నల్లగొండ : వర్షంలోనే స్కూటీపై వెళ్తున్న యువతులు

చల్లబడ్డ వాతావరణం

అకాల వర్షంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. ఈ వేసవిలో చాలా రోజులు ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలపైనే నమోదయ్యాయి. దీంతో జనం వేడిమితో అల్లాడారు. బుధవారం ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై వర్షం కురవడంతో ఉపశమనం పొందారు. గరిష్ట ఉష్ణోగ్రత కూడా 36 డిగ్రీలకు పడిపోయింది.

నేటి నుంచి ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

- హాజరుకానున్న 12954 మంది విద్యార్థులు

నల్లగొండ : ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు గురువారం నుంచి ఈనెల 29వ తేదీ వరకు జరగనున్నాయి. పరీక్షలకు 11376 మంది సాధారణ విద్యార్థులు, 1578 మంది ఒకేషనల్.. మొత్తం 12,954 మంది విద్యార్థులు హాజరు కానున్నారు. జిల్లాలో 36 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. రోజూ ఉదయం 9 నుంచి 12 గంటల వరకు ఫస్టియర్, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు సెకండియర్ పరీక్షలు నిర్వహించనున్నారు. పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు డీఐఈఓ దస్రూనాయక్ తెలిపారు. ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు జూన్ 3 నుంచి 6వ తేదీ వరకు నిర్వహిస్తామని పేర్కొన్నారు.



హాల్‌టికెట్ నంబర్లు వేస్తున్న సిబ్బంది

ఇళ్ల నిర్మాణాన్ని వేగవంతం చేయాలి



లబ్ధిదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి, చిత్రంలో ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ రాజ్‌కుమార్

- కలెక్టర్ ఇలా త్రిపాఠి

కనగల్ : ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని వేగవంతం చేసి.. వర్షాకాలంలోపు గృహ ప్రవేశాలు పూర్తయ్యేలా చూడాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. బుధవారం కనగల్ మండలం తేలకంటిగూడెం గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల పురోగతిని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా తేలకంటిగూడెంలో 107 ఇళ్లను మంజూరు చేశామని.. ఇందులో 71 ఇళ్లు గ్రౌండింగ్ కాగా, ప్రస్తుతం 48 ఇండ్లు బేస్మెంట్ స్థాయిలో, రెండు రూఫ్ స్థాయిలో ఉన్నాయన్నారు. 44 ఇండ్లకు బేస్మెంట్ బిల్లులు చెల్లించామన్నారు. ఈ సందర్భంగా పలువురు లబ్ధిదారులు.. కలెక్టర్‌తో మాట్లాడుతూ సంవత్సరాల తరబడి గుడిసెల్లో జీవిస్తున్న తమకు రాష్ట్ర ప్రభుత్వం ఇళ్లను మంజూరు చేయడమే కాకుండా, ఇంత త్వరగా ఇండ్లు కట్టించి ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. ఇందుకుగాను ప్రభుత్వానికి, కలెక్టర్‌కు వారు కృతజ్ఞతలు తెలిపారు. కలెక్టర్ వెంట ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ రాజ్‌కుమార్, మాజీ సర్పంచ్ బోగారి రాంబాబు తదితరులు ఉన్నారు.

స్వయం ఉపాధి కోర్సుల్లో శిక్షణ

నల్లగొండ : స్వయం ఉపాధి కోర్సుల్లో శిక్షణను యువత సద్వినియోగం చేసుకొని ఉపాధి, ఉద్యోగ అవకాశాలను పొందవచ్చని సెట్విన్ శిక్షణ సంస్థ నల్లగొండ కో ఆర్డినేటర్ ఎం.సరిత అన్నారు. నల్లగొండ పట్టణంలోని సెట్విన్ సాంకేతిక శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో ఉపాధి కోర్సుల్లో శిక్షణ ఇచ్చిన మొదటి బ్యాచ్‌కు బుధవారం పరీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మార్కెట్లో డిమాండ్ ఉన్న ఎడ్యుకేషన్ కోర్సులు, కంప్యూటర్ బేసిక్స్, డీటీపీ, ఎలక్ట్రీషియన్, ప్లంబర్, మొబైల్ రిపేరింగ్, కంప్యూటర్, బ్యూటీషియన్, డిప్లమా ఇన్ ఫ్యాషన్ డిజైనింగ్, టెక్స్‌టైల్స్ డిజైనింగ్, కుట్టు మిషన్ తదితర కోర్సుల్లో 50 శాతం ఫీజు రాయితీతో శిక్షణ ఇచ్చామన్నారు. నిరుద్యోగులు, విద్యార్థులు స్వయం ఉపాధి కోర్సులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



పరీక్ష రాస్తున్న నిరుద్యోగులు

ఎరువుల దుకాణదారులు నిబంధనలు పాటించాలి

కొండమల్లేపల్లి : ఎరువుల దుకాణదారులు నిబంధనలు పాటించాలని జిల్లా వ్యవసాయ అధికారి పాల్వాయి శ్రావణ్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం కొండమల్లేపల్లి మండల కేంద్రంలో ఎరువుల దుకాణాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు విత్తనాలు కొనేటప్పుడు రశీదు తీసుకోవాలని, డీలర్లు విత్తనాలను ఎమ్మార్పీ ధరలకు విక్రయించాలని, రైతులు ఎరువులు కొనుగోలు చేసేసమయంలో విధిగా ఆధార్‌కార్డు వెంట తెచ్చుకోవాలని సూచించారు. ఎరువులు విక్రయించే డీలర్లు ఈ-పాస్ ద్వారా మాత్రమే అమ్మకాలు జరపాలన్నారు. అంతకు ముందు పలు రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట ఏఓ వై.జానకిరాములు, ఏఈఓ, డీలర్లు తదితరులు ఉన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న డీఏఓ శ్రావణ్‌కుమార్

క్యాంటీన్ నిర్వహణకు టెండర్ల ఆహ్వానం

రామగిరి(నల్లగొండ): నల్లగొండలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో 2025–2028 వరకు క్యాంటీన్ నిర్వహణకు టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సిహెచ్.నరసింహారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు ఫారాలు కళాశాలలో అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. టెండర్ సీల్డ్ కవర్‌ను మే 30వ తేదీ సాయంత్రం 4 గంటలలోపు కళాశాలలోని డ్రాబాక్స్‌లో వేయాలని సూచించారు.

ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి స్థల పరిశీలన

నాగార్జునసాగర్ : సాగర్ హిల్‌కాలనీలో నాగార్జునసాగర్–హైదరాబాద్ రహదారి వెంట ఉన్న మహాత్మాజ్యోతీబాపూలే బీసీ గురుకుల విద్యాలయం ఎదుట ఫుట్ ఓవర్‌బ్రిడ్జి నిర్మాణానికి కలెక్టర్ ఇలా త్రిపాఠి బుధవారం స్థల పరిశీలన చేశారు. రోడ్డుకు ఇరువైపులా పాఠశాల, హాస్టల్ ఉండడంతో రోజూ మూడు సార్లు 1200 మంది విద్యార్థులు కష్టంగా రోడ్డు దాటుతున్నారు. విద్యార్థుల ఇబ్బందులను తొలగించేందుకు ఇక్కడ ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మిస్తున్నారు.

డిగ్రీ కళాశాలను మార్చాలని వినతి

బీసీ గురుకుల విద్యాలయం ఆవరణలో ఉన్న డిగ్రీ కళాశాలను ఇక్కడి నుంచి మార్చాలని కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చారు. వెంటనే ప్రత్యామ్నాయంగా మరో బిల్డింగ్ ఎక్కడ ఉందని అడగగా.. సాగర్ ఎర్త్‌డ్యాం దిగువన పాత బీఈడీ కళాశాల భవనం ఉందని చెప్పడంతో.. వర్షంలోనే కలెక్టర్ అక్కడికి వెళ్లి బిల్డింగ్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, తహసీల్దార్ శ్రీనివాసరావు, ఆర్ఐ శ్రీనివాసరెడ్డి తదితరులు ఉన్నారు.



బీసీ గురుకుల డిగ్రీ కళాశాలను మార్చేందుకు పాత బీఈడీ కళాశాల భవనాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

ఉపాధి హామీపై నిఘా

- పనుల పర్యవేక్షణకు విలేజ్ మానిటరింగ్ కమిటీలు
- ఐదుగురు సభ్యులతో ఏర్పాటు

దేవరకొండ: గ్రామీణ ప్రాంతాల్లో వలసలను నివారించి, కూలీలకు స్థానికంగా పనులు కల్పించేందుకు కేంద్రం మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని మలు చేస్తోంది. ఈ పథకాన్ని క్షేత్రస్థాయిలో పారదర్శకంగా, పకడ్బందీగా అమలు చేసేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించింది. గ్రామీణ స్థాయిలో ఉపాధి హామీ పనులపై నిఘా పెట్టేందుకు చర్యలు తీసుకుంటోంది. ఈ క్రమంలో గ్రామస్థాయిలో పనుల పర్యవేక్షణకు విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ (వీఎంసీ)లను ఏర్పాటు చేసింది. పనుల పర్యవేక్షణతో పాటు సామాజిక తనిఖీ నివేదికలపై ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహించి అవకతవకలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకునేలా ప్రభుత్వం కలెక్టర్లకు ఉత్తర్వులు జారీ చేసింది.



పథకం వివరాలు ఇలా..	
జిల్లాలో ఉపాధి హామీ జాబ్ కార్డులు	3.60 లక్షలు
మొత్తం నమోదైన కూలీలు	7.66 లక్షలు
ప్రస్తుతం పనులు చేస్తున్నవారు	3.83 లక్షలు

ఇప్పటికే సర్క్యులర్ జారీ

ప్రతి గ్రామపంచాయతీలో ఐదుగురు సభ్యులతో వీఎంసీ కమిటీలను ఏర్పాటు చేశారు. ఈ కమిటీల్లో ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు, రిసోర్స్ పర్సన్‌లు ఉండే విధంగా చర్యలు తీసుకున్నారు. మండలాల్లోని పంచాయతీల్లో ప్రత్యేక అధికారులు, కార్యదర్శులు కమిటీలను ప్రతిపాదిస్తూ ఇప్పటికే జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారులకు నివేదికలు పంపించారు. ఈ కమిటీలు దాదాపు ఆరు నెలలకు పైగా పనిచేసే విధంగా ప్రతిపాదనలు రూపొందించినట్లు తెలుస్తోంది. దీనికి సంబంధించిన సర్క్యులర్‌ను ఆయా పంచాయతీల కార్యదర్శులు పంపించారు.

పనుల పరిశీలన ఇలా..

ఉపాధి హామీ పథకంలో చేపట్టిన పనులు పారదర్శకంగా జరిగేలా వీఎంసీలు నిరంతరం పర్యవేక్షణ చేయనున్నాయి. వారానికి ఒక సారి ఉపాధి హామీ పనులను కమిటీలు పరిశీలించనున్నట్లు సంబంధిత అధికారులు చెబుతున్నారు. పనుల నిర్వహణపై కూలీలతో చర్చించనున్నారు. ఉపాధి హామీ పనుల రికార్డులు, సౌకర్యాలను పరిశీలించడంతో పాటు పనుల నాణ్యత, వ్యయాన్ని అంచనా వేయడం, చేపట్టిన పనులపై నివేదిక ఇవ్వడం, లెక్కింపు, పనులను రిజిస్టర్‌లో నమోదు చేయడం వంటివి కమిటీలు చేయాల్సి ఉంది. కమిటీల పర్యవేక్షణతో ఉపాధి హామీ పనులు పారదర్శకంగా జరుగుతాయని అధికారులు పేర్కొంటున్నారు.

క్లుప్తంగా

'ఇస్రో' శిక్షణ తరగతులకు ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో తేజ విద్యాలయం ప్రిన్సిపాల్ రమాసోమిరెడ్డి

కోదాడ: భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) జూన్ 23 నుంచి 27 వరకు రిమోట్ సెన్సింగ్ పరిజ్ఞానంపై నిర్వహించనున్న శిక్షణ తరగతులకు కోదాడ పట్టణంలోని తేజ విద్యాలయంకు చెందిన పదో తరగతి విద్యార్థులు ఏసిరెడ్డి శ్రీవల్లి, తూనుగంట్ల సమజ్ఞ ఎంపికయ్యారు. వీరికి ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని డెహ్రాడూన్‌లో గల ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రిమోట్ సెన్సింగ్ కార్యాలయంలో శిక్షణ ఉంటుందని పాఠశాల ప్రిన్సిపాల్ ఉస్తేల రమాసోమిరెడ్డి బుధవారం తెలిపారు. ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు అభినందించారు.

అధ్యాపకుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

సంస్థాన్ నారాయణపురం: మండలంలోని సర్వేల్ గురుకుల కళాశాలలో కాంట్రాక్టు పద్ధతిలో అధ్యాపకుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎస్. సతీష్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఇంగ్లిష్ మాధ్యమంలో గణితం, భౌతికశాస్త్రం, రసాయన శాస్త్రంతో పాటు సంస్కృతం సబ్జెక్టులు బోధించడానికి ఆసక్తి గలవారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 99899 51824 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

వృద్ధురాలి మెడలో బంగారు గొలుసు చోరీ

చౌటుప్పల్ రూరల్: గుర్తుతెలియని వ్యక్తులు వృద్ధురాలి మెడలోని బంగారు గొలుసు లాక్కొని పారిపోయారు. ఈ ఘటన చౌటుప్పల్ మండలం ఖైతాపురం గ్రామంలో బుధవారం మధ్యాహ్నం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖైతాపురం గ్రామానికి చెందిన గోపనబోయిన యశోద దండుమల్కాపురం గ్రామంలో తమ బంధువుల వెళ్లి వస్తుండగా.. ఖైతాపురం గ్రామంలోకి రాగానే వర్షం పడింది. దీంతో ఆమె గ్రామ చౌరస్తాలో ఉన్న ఓ ఇంటి వద్ద కూర్చుంది. వర్షం తగ్గిన తర్వాత ఇంటికి వెళ్తుండగా.. బైక్‌పై ముగ్గురు గుర్తుతెలియని వ్యక్తులు వెనుక నుంచి వచ్చి ఆమె మెడలోని తులంన్నర బంగారు గొలుసు లాక్కొని పరారయ్యారు. వెంటనే యశోద కేకలు వేయడంతో గ్రామస్తులు బైక్‌పై పారిపోతున్న వ్యక్తులను పట్టుకునే ప్రయత్నం చేయగా, వారు దొరకకుండా హైదరాబాద్ వైపు పారిపోయారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చౌటుప్పల్ సీఐ మన్మథకుమార్ తెలిపారు.

పిడుగు పడి మహిళా రైతు మృతి

రామగిరి(నల్లగొండ): నల్లగొండ మండలం అప్పాజిపేట గ్రామ పంచాయతీ పరిధిలోని బంటుగూడెంలో బుధవారం మధ్యాహ్నం పిడుగుపడి మహిళా రైతు మృతిచెందింది. బంటుగూడేనికి చెందిన జాల బిక్షపమ్మ(46) తన వ్యవసాయ బావి వద్ద నిమ్మ తోటలో పనిచేస్తుండగా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం వచ్చింది. ఈ సమయంలో ఆమెపై పిడుగుపడడంతో అక్కడికక్కడే మృతిచెందింది. మృతురాలికి భర్త, కుమార్తె, కుమారుడు ఉన్నారు. పిడుగుపాటుకు ఇతర కూలీలు భయాందోళనకు గురయ్యారు.

గత పాలకుల తీరుతో రాష్ట్రానికి అన్యాయం

- కృష్ణా జలాల్లో వాటా పెంపునకు ట్రిబ్యునల్‌తో పోరాడుతున్నాం
- నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పక్కన సూర్యాపేట కలెక్టర్ తేజస్ నందలాల్

హుజూర్‌నగర్: కృష్ణానది జలాల పంపకాల విషయంలో గత పాలకుల తీరుతో పదేళ్ల తెలంగాణకు తీవ్రమైన అన్యాయం జరిగిందని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్‌పై గత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో దక్షిణ తెలంగాణ ఎడారిగా మారిందన్నారు. తెలుగు రాష్ట్రాలకు 811 టీఎంసీలు కేటాయించగా ఆంధ్రప్రదేశ్‌కు 512 టీఎంసీలు(66 శాతం), తెలంగాణకు 299 టీఎంసీలు (34శాతం) అని జరిగిన లిఖిత పూర్వక ఒప్పందాన్ని గత పాలకులు అంగీకరించి తెలంగాణకు తీవ్ర అన్యాయం చేశారని ఆయన పేర్కొన్నారు. మంత్రి ఉత్తమ్ సూర్యాపేట జిల్లా చింతలపాలెం మండలంలోని రాజీవ్‌గాంధీ, ఎంబీసీ, నక్కగూడెం ఎత్తిపోతల పథకాల పనుల పురోగతిపై బుధవారం చింతలపాలెంలోని అంజలి సిమెంట్ ఆడిటోరియంలో జిల్లా కలెక్టర్ తేజస్‌నంద్‌లాల్ పవార్‌తో కలిసి ఇరిగేషన్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. తాము అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి, ఇరిగేషన్ మంత్రిగా నేను, న్యాయకోవిదుల, నిపుణులను సంప్రదించి సలహాలు తీసుకొని కృష్ణా జలాల పంపకంలో 70 శాతం తెలంగాణకు తీసుకొచ్చేలా ట్రిబ్యునల్ పునఃసమీక్షించేలా చేశామన్నారు. తమ ప్రభుత్వం ట్రిబ్యునల్‌తో పోరాటం చేస్తుందని ఆయన తెలిపారు. పాలమూరు – రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి కృష్ణా జలాలలో నీరు కేటాయించలేదని, తాము వచ్చాక నీటి కేటాయింపు కోసం పట్టుబట్టి పోరాడుతున్నామని మంత్రి తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టు పేరుమీద పెద్ద ఎత్తున నిధులు వృథా చేశారని, లక్ష కోట్లతో కట్టిన ప్రాజెక్టు కూడా వారి హయాంలోనే కూలిపోయిందన్నారు. గత కాంగ్రెస్ ప్రభుత్వంలో సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో రూ.38,000 కోట్లతో మొదలుపెట్టిన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టు పనులు మొదలు పెట్టారని, అది పూర్తి చేస్తే బాగుండేదన్నారు. దానిని రద్దు చేసి కాళేశ్వరం పేరుతో అంచనాలు పెంచి అప్పులు తెచ్చి లక్ష కోట్ల రూపాయల ప్రజాధనం దుర్వినియోగం చేశారని మంత్రి ఉత్తమ్ అన్నారు. కృష్ణానదిపై నిర్మిస్తున్న అన్ని ప్రాజెక్టులు త్వరగా పూర్తయ్యే విధంగా సీఎంతో కలిసి సమీక్షించినట్లు ఆయన తెలిపారు.

ఇంటికొక రక్తదాత తయారు కావాలి

- సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ



మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ

మోత్కూరు: రక్తాన్ని కృత్రిమంగా తయారు చేయలేమని, ఇంటికొక రక్తదాత తయారుకావాలని సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ అన్నారు. మోత్కూరు మండలం పాటిమట్లలో మాతృదేవోభవ-పితృదేవోభవ సంస్థ 6వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం రక్తదాతల అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. యువత స్వచ్ఛందంగా ముందుకొచ్చి రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. మాతృదేవోభవ-పితృదేవోభవ సంస్థ అధ్యక్షుడు కురుమేటి నవీన్ బాల్యంలోనే తన తల్లిదండ్రులను కోల్పోయి, వారి జ్ఞాపకార్థం ఈ సంస్థను ఏర్పాటు చేసి వృద్ధులు, వితంతువులు, అనాథలు, పేదలు, నిరుపేదలకు సేవ చేయడం అభినందనీయమన్నారు. కురుమేటి నవీన్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సర్దార్ సర్వాయి పాపన్న, గీత కార్మిక సంఘం ఆలిండియా అధ్యక్షుడు కప్పల రవికుమార్ గౌడ్, తెలంగాణ నర్సింగ్ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు కురుమేటి గోవర్దన్, ఇండియన్ రెడ్‌క్రాస్ జిల్లా అధ్యక్షుడు గుర్రం లక్ష్మీనర్సింహారెడ్డి, మదర్ డెయిరీ డైరెక్టర్ రచ్చ లక్ష్మీనర్సింహారెడ్డి, ఉపాధ్యాయుడు ముక్కాముల లింగమల్లు, జనయేత్రి ఫౌండేషన్ అధ్యక్షుడు మునీర్ అహ్మద్ షరీఫ్, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, రక్తదాతలు పాల్గొన్నారు.

సంస్కారం, వినయం నేర్పించాలి

విద్యార్థులకు చదువుతో పాటు సంస్కారం, వినయం నేర్పించాలని సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ అన్నారు. మోత్కూరు, అడ్డగూడూరు మండలాలకు చెందిన ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు మోత్కూరు జెడ్పీహెచ్‌ఎస్‌లో నిర్వహిస్తున్న వృత్యంతర శిక్షణకు బుధవారం ఆయన హాజరై మాట్లాడారు. విద్యార్థులకు చెడు లక్షణాలు అలవడితే సమాజం ఉపాధ్యాయులనే బాధ్యులను చేస్తుందన్నారు. విద్యార్థులపై సినిమాల ప్రభావం తీవ్రంగా ఉందని, వాటిని విస్మరించే విధంగా మంచి ప్రవర్తన నేర్పించాలని సూచించారు. ప్రాథమిక విద్యకు పాలకులు ప్రాధాన్యత ఇవ్వడం లేదని అన్నారు. ఆయన వెంట ఎంఈఓ గోపాల్‌రెడ్డి ఉన్నారు.

పిడుగుపాటుతో పాడి పశువులు మృతి

కట్టంగూర్: మండలంలోని కురుమర్తి గ్రామంలో బుధవారం పిడుగుపడి రెండు పాడి గేదెలు మృతిచెందాయి. కురుమార్తి గ్రామానికి చెందిన రైతు కొమ్మిడి దామోదర్‌రెడ్డి తన వ్యవసాయ బావి వద్ద ఉన్న చెట్టుకు గేదెలను కట్టేశాడు. బుధవారం మధ్యాహ్నం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురవడంతో పాటు పిడుగుపడింది. దీంతో చెట్టుకు కట్టేసిన గేదెలు అక్కడికక్కడే మృతిచెందాయి. మృతిచెందిన గేదెల విలువ సుమారు రూ.2 లక్షలు ఉంటుందని, తనను ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు కోరుతున్నాడు.

రెండు ఆవులు..

పెద్దఅడిశర్లపల్లి: పిడుగుపాటుకు గురై రెండు ఆవులు మృతిచెందాయి. ఈ ఘటన పెద్దఅడిశర్లపల్లి మండలంలో బుధవారం చోటు చేసుకుంది. పెద్దఅడిశర్లపల్లి మండలం పెద్దగట్టు గ్రామానికి చెందిన రైతు మేరావత్ శంకర్ ఆవులు బుధవారం పొలంలో మేతకు వెళ్లాయి. ఆ సమయంలో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షంలో పిడుగు పడడంతో రెండు ఆవులు మృతి చెందాయి. సుమారు రూ.80వేల వరకు నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు కోరుతున్నాడు.

విద్యుదాఘాతంతో రెండు గేదెలు

మేళ్లచెరువు: విద్యుదాఘాతంతో రెండు గేదెలు మృతిచెందాయి. మేళ్లచెరువు మండలం రేవూరు గ్రామానికి చెందిన బండి గోవిందరాజు, గోళ్ల గంగరాజు తమ గేదెలను రోజుమాదిరిగానే బుధవారం కూడా గ్రామ పరిధిలోని పొలాల్లోకి మేతకు తీసుకెళ్లారు. ఈ క్రమంలో తీవ్రమైన గాలితో కూడిన వాన కురిసింది. దీంతో పొలాల్లోని విద్యుత్ తీగలు తెగిపడ్డాయి. ఈ విద్యుత్ తీగలకు రెండు గేదెలు తగలడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాయి. తమకు జీవనాధారమైన గేదెలు మృతిచెందాయని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతులు కోరుతున్నారు.

ఫేక్ మనీ ట్రాన్స్‌ఫర్ యాప్‌తో మోసం

గరిడేపల్లి: గరిడేపల్లి మండలం అబ్బిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన ఓ యువకుడు ఫేక్ మనీట్రాన్స్‌ఫర్ యాప్ ద్వారా డబ్బులు పంపిస్తూ దొరికిపోయాడు. బుధవారం గరిడేపల్లిలోని ఓ వైన్స్‌లో మద్యం తీసుకున్న అతడు రూ.1200 ట్రాన్స్‌ఫర్ చేసినట్లు చూపించగా.. మెసేజ్ వచ్చినా డబ్బులు అకౌంట్‌లో జమకాకపోవడంతో అనుమానంతో యువకుడిని వైన్ షాప్ యాజమాని పట్టుకొని పోలీసులకు అప్పగించాడు. దీనిపై పోలీసులు విచారణ చేసి ఇది చైన్ సిస్టంతో కూడుకున్న మోసంగా అనుమానిస్తున్నారు. యువకుడి సెల్‌ఫోన్, యాప్ మూలాలు, ఇతర వివరాలపై దర్యాప్తు చేస్తున్నారు.

ఏడుగురి వ్యక్తుల రిమాండ్

ఆత్మకూరు(ఎం): ఆత్మకూరు(ఎం) మండలంలోని మొరిపిరాల గ్రామానికి చెందిన ఏడుగురు వ్యక్తులను రిమాండ్ చేసినట్లు ఏసీపీ పి. మధుసూదన్‌రెడ్డి బుధవారం పేర్కొన్నారు. భర్త, అత్తమామల వేధింపులు తాళలేక మొరిపిరాల గ్రామానికి చెందిన కటిక సంధ్య ఈ నెల 18న ఆత్మకూరు (ఎం) మండల కేంద్రంలో ఓ వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు సంధ్య ఆత్మహత్యకు కారకులైన వారిని గుర్తించి రిమాండ్ చేసినట్లు ఏసీపీ తెలిపారు. రిమాండ్ చేసిన వారిలో సంధ్య భర్త కటికె కృష్ణ, అత్త మారెమ్మ, మామ రాములుతో పాటు శివగణేష్, శ్రీను, రమ్య, వాణి ఉన్నట్లు పేర్కొన్నారు.

హత్యాయత్నం కేసులో యువకుడికి జైలు శిక్ష

రామగిరి(నల్లగొండ): తన ప్రేమను నిరాకరించిన యువతిపై హత్యాయత్నానికి పాల్పడిన యువకుడికి 9 ఏళ్ల జైలు శిక్ష విధిస్తూ నల్లగొండ ఫ్యామిలీ కోర్టు మూడో అదనపు కోర్టు జడ్జి డి. దుర్గా ప్రసాద్ బుధవారం తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. నల్లగొండ పట్టణంలోని పానగల్‌కు చెందిన గుండెబోయిన నవ్య స్థానిక ఎన్జీ కళాశాలలో డిగ్రీ చదువుతోంది. అదే కాలేజీలో చదువుతున్న అబ్బాసియా కాలనీకి చెందిన మీసాల రోహిత్ ఆమెను ప్రేమ పేరుతో వేధించడం మొదలుపెట్టాడు. తనకి ఇష్టం లేదని చెప్పినా వినకుండా రోహిత్ నవ్య వెంట పడేవాడు. దీంతో ఆమె తన సోదరుడు నాగార్జునకు విషయం చెప్పింది. నాగార్జున రోహిత్ కుటుంబ సభ్యులతో మాట్లాడడంతో నవ్యను ఇబ్బంది పెట్టనని రోహిత్ చెప్పాడు. కొన్ని రోజుల వరకు నవ్యకు ఫోన్ చేయలేదు. 2022 ఆగస్టు 9వ తేదీన రోహిత్ తన స్నేహితుడితో నవ్యకు ఫోన్ చేయించి ఆమెతో మాట్లాడాలి అని చెప్పి బీటీఎస్‌లోని అటవీశాఖ కార్యాలయం పార్కుకు రమ్మన్నాడు. దీంతో నవ్య తన స్నేహితురాలు సాయిశ్రేష్ఠతో కలిసి పార్కుకు వెళ్లింది. పార్కులో నవ్యను కలిసిన రోహిత్ ఇక నుంచి ఇబ్బంది పెట్టను అని ఆమెతో చెప్పాడు. అనంతరం నవ్య తిరిగి వెళ్తుండగా.. అప్పటికే తనతో తెచ్చుకున్న కత్తితో నవ్యపై రోహిత్ విచక్షణారహితంగా దాడి చేశాడు. స్థానికులు వెంటనే నవ్యను నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటన కంటే పది రోజుల ముందు కూడా తనను ప్రేమించకుంటే చంపేస్తానని బీరు సీసాతో తన గొంతు కోసేందుకు రోహిత్ యత్నించాడని నవ్య తన వాంగ్మూలంలో పేర్కొంది. నవ్య తండ్రి గుండెబోయిన రామలింగయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి వన్‌టౌన్ సీఐ గోపి కేసు నమోదు చేయగా.. అప్పటి డీఎస్పీ నరసింహారెడ్డి విచారణ చేపట్టి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేసి నిందితుడిని కోర్టులో హాజరుపర్చారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ వాదనలతో ఏకీభవించిన జడ్జి డి. దుర్గాప్రసాద్ రోహిత్‌కు 9ఏళ్ల జైలుశిక్ష, రూ.10వేలు జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు. జరిమానా చెల్లించకపోతే మరో 3నెలలు జైలు శిక్ష అనుభవించాలని తీర్పులో పేర్కొన్నారు. ప్రస్తుత డీఎస్పీ శివరాంరెడ్డి, వన్‌టౌన్ సీఐ రాజశేఖర్‌రెడ్డి, లైజన్ ఆఫీసర్లు నరేందర్, మల్లికార్జున్ విచారణకు సహకరించారు.

వ్యక్తి ఆత్మహత్యకు కారణమైన ఐదుగురికి..

మాడ్గులపల్లి: వ్యక్తి ఆత్మహ్యత్యకు కారణమైన ఐదుగురికి మూడేళ్ల జైలు శిక్ష, రూ.1000 జరిమానా విధిస్తూ మిర్యాలగూడ అసిస్టెంట్ సెషన్స్ కోర్టు జడ్జి బుధవారం తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. మాడ్గులపల్లి మండలం కన్నెకల్ గ్రామానికి చెందిన కుంచెం లింగయ్య అదే గ్రామానికి చెందిన గంటికంపు సైదులు వద్ద 2006లో 4.10ఎకరాల భూమి కొనుగోలు చేశాడు. అట్టి భూమిని బాండ్ పేపర్‌పై కొనుగోలు చేసి అగ్రిమెంట్ తన భార్య కుంచెం సైదమ్మ పేరు మీద చేయించాడు. కానీ అట్టి భూమి రిజిస్ట్రేషన్ చేయలేదు. కొంతకాలం నుంచి గంటికంపు సైదులు, అతడి కొడుకులు గంటికంపు జానయ్య, జనార్దన్, జగదీష్, భార్య గంటికంపు మల్లమ్మ అట్టి భూమిని దున్నుతూ ఇబ్బందులు పెడుతున్నారు. ఇదేమిటని అడిగిన కుంచెం లింగయ్యపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెడతామని బెదిరిస్తూ వచ్చారు. ఈ క్రమంలో వారి వేధింపులు భరించలేక 2017లో లింగయ్య పత్తి చేనులో మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య సైదమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్ఐ కె. సురేష్‌గౌడ్ కేసు నమోదు చేసి చార్జ్‌షీట్ దాఖలు చేయగా.. నిందితులు గంటికంపు సైదులు, జానయ్య, జనార్దన్, జగదీష్, మల్లమ్మపై నేరం రుజువు కావడంతో ఒక్కొక్కరికి మూడు సంవత్సరాల జైలు శిక్ష, రూ. 1000 చొప్పున జరిమానా విధిస్తూ తీర్పునిచ్చినట్లు ఎస్ఐ కృష్ణయ్య బుధవారం తెలిపారు. ప్రాసిక్యూషన్ తరఫున ఎస్. కృష్ణవేణి వాదనలు వినిపించారు. ఈ కేసులో సాక్షులను సకాలంలో ప్రవేశపెట్టి ప్రాసిక్యూషన్‌కు సహకరించిన కోర్ట్ కానిస్టేబుల్ డి. కిరణ్‌కుమార్‌ని మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర్‌రాజు అభినందించారు.

ఒకదానికొకటి ఢీకొన్న ట్రావెల్స్ బస్సులు, కంటెయినర్

- రెండు బస్సులు పాక్షికంగా ధ్వంసం
- క్షేమంగా బయటపడిన ప్రయాణికులు



ప్రమాదంలో ధ్వంసమైన బస్సు ముందుభాగం

చౌటుప్పల్ రూరల్: హైవేపై ట్రావెల్స్ బస్సు డ్రైవర్ సడన్ బ్రేక్ వేయడంతో దాని వెనుకనే వస్తున్న మరో రెండు బస్సులు, కంటెయినర్ ఒకదానికొకటి ఢీకొన్నాయి. ఈ ఘటన విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిపై చౌటుప్పల్ మండలం బొర్రోళ్లగూడెం గ్రామ స్టేజీ సమీపంలో బుధవారం ఉదయం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ నుంచి ప్రయాణికులతో వస్తున్న ఆరెంజ్ ట్రావెల్స్ బస్సు డ్రైవర్ చౌటుప్పల్ మండలం బొర్రోళ్లగూడెం గ్రామ పరిధిలోకి రాగానే విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిపై ఒక్కసారిగా బ్రేక్ వేశాడు. దీంతో దాని వెనుక నుంచే వస్తున్న రమణ ట్రావెల్స్ బస్సు, ఆ వెనుకనే వస్తున్న కంటెయినర్, కంటెయినర్‌ను వెనుక నుంచి మరో ట్రావెల్స్ బస్సు ఒకదానికొకటి ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో రెండు బస్సులు పాక్షికంగా దెబ్బతిన్నాయి. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదు. హైవేపై హైదరాబాద్ వైపు ట్రాఫిక్ జాం అయ్యింది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని చౌటుప్పల్ సీఐ మన్మథకుమార్ తెలిపారు.

• శిక్షణలో తల్లి .. బిడ్డ లాలనలో తండ్రి



డిండి: డిండి మండలం చెరుకుపల్లి జెడ్పీహెచ్‌ఎస్‌లో ఉపాధ్యాయులకు విద్యా బోధనపై శిక్షణ తరగతులు జరుగుతున్నాయి. ఈ శిక్షణ తరగతులకు వావిల్‌కోల్ పాఠశాలలో ఎస్జీటీగా పనిచేస్తున్న రామానుజమ్మ కూడా హాజరవుతోంది. బుధవారం రామానుజమ్మ శిక్షణలో ఉండగా.. ఆమె ఐదు నెలల బిడ్డను భర్త శంకర్‌రావు పాఠశాల ఆవరణలో చెట్టుకు చీరతో కట్టిన ఉయ్యాలలో నిద్రపుచ్చుతూ కనిపించాడు.

కృష్ణా నదిలో గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం



పార్వతీశంచారి (ఫైల్)

హుజూర్‌నగర్: కృష్ణా నదిలో గల్లంతైన వ్యక్తి మృతదేహం బుధవారం లభ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హుజూర్‌నగర్ మండలం చింత్రియాల గామానికి చెందిన బంగారు పార్వతీశం చారి(40) మంగళవారం సాయంత్రం పాత కిష్టాపురం గ్రామ పరిధిలో కృష్ణా నది పాయలో ఉన్న గేదెలను తోలేందుకు నదిలో ఈదుకుంటూ వెళ్లి గల్లంతయ్యాడు. అతడి ఆచూకీ కోసం పడవల సహాయంతో గాలింపు చర్యలు చేపట్టగా బుధవారం మృతదేహం లభ్యమైంది. మృతుడికి భార్య లావణ్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. మృతుడి భార్య లావణ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ప్రొబెషనరీ ఎస్ఐ అజయ్‌కుమార్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

చౌటుప్పల్: విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిపై చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని లింగోజిగూడెం గ్రామ శివారులో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలయ్యాయి. లింగోజిగూడెం గ్రామానికి చెందిన మందోరి మహేష్ ద్విచక్ర వాహనంపై చౌటుప్పల్ నుంచి స్వగ్రామానికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో గ్రామ సమీపంలో విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిపై గల అండర్‌పాస్ బ్రిడ్జిపై ముందు వెళ్తున్న ప్రైవేట్ ట్రావెల్ బస్సు డ్రైవర్ అకస్మాత్తుగా బ్రేక్ వేశాడు. దీంతో వెనుకనే వస్తున్న మహేష్ బస్సును ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో మహేష్‌కు గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం అతడిని హైదరాబాద్‌కు తరలించారు. మహేష్ అన్న సురేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మన్మథకుమార్ తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తుల మృతదేహాలు లభ్యం



యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట పట్టణంలో బుధవారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. పట్టణ సీఐ బి. భాస్కర్ తెలిపిన వివరాల ప్రకారం.. యాదగిరిగుట్ట పట్టణంలోని రింగ్ రోడ్డు సమీపంలో గల పార్కింగ్ ప్రాంతంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడని స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి వయస్సు సుమారు 35 నుంచి 40ఏళ్లు ఉంటాయని, అతడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదని సీఐ తెలిపారు. మృతదేహాన్ని భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించి, కేసు నమోదు చేసినట్లుపేర్కొన్నారు.

మోత్కూరులో..



మోత్కూరు: మోత్కూరు మున్సిపల్ కేంద్రంలోని కొత్త బస్టాండ్ సమీపంలో బుధవారం మధ్యాహ్నం స్థానికులు గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని గుర్తించారు. మృతుడు కొద్దిరోజులుగా భిక్షం ఎత్తుకుంటూ బస్టాండ్ సమీపంలో సంచరిస్తున్నాడని స్థానికులు పేర్కొన్నారు. మృతదేహాన్ని రామన్నపేట ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు ఎస్ఐ డి. నాగరాజు తెలిపారు.

లారీ, బైక్‌ను ఢీకొట్టిన కారు

తాళ్లగడ్డ (సూర్యాపేట): రోడ్డు పక్కన ఆగి ఉన్న లారీ, బైక్‌ను కారు ఢీకొట్టింది. ఈ ఘటన సూర్యాపేట మండలం బాలెంల సమీపంలో బుధవారం జరిగింది. సూర్యాపేటకు చెందిన చెందిన వెంకన్న కుటుంబంతో కలిసి కారులో జనగామలో శుభకార్యానికి వెళ్లి తిరిగి వస్తుండగా.. బాలెంల సమీపంలోని వీడీఆర్ ఫంక్షన్‌హాల్ వద్ద రోడ్డు పక్కన పార్కింగ్ చేసిన లారీని, పక్కనే ఉన్న బైక్ ఢీకొట్టారు. కారులో డ్రైవర్‌తో సహా నలుగురు ఉండగా.. ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదని స్థానికులు తెలిపారు.

మారణాయుధాలతో తిరుగుతున్న వ్యక్తి రిమాండ్

భువనగిరిటౌన్: మారణాయుధాలతో తిరుగుతున్న వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించారు. భువనగిరి టౌన్ సీఐ రమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. భువనగిరి చెరువు కట్ట వద్ద మంగళవారం సాయంత్రం ఎస్ఐ లక్ష్మీనారాయణ తన సిబ్బందితో కలిసి వాహనాలు తనిఖీ చేస్తుండగా.. భువనగిరికి చెందిన మహమ్మద్ గఫూర్ అలియాస్ బాబా బైక్‌ను ఆపారు. అతడి వద్ద బొమ్మ పిస్తోల్, పెద్ద కత్తి స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు రౌడీ షీటర్ అని, ఆర్థిక సమస్యలతో సతమతమవుతున్న అతడు బెదిరించి డబ్బులు వసూలు చేయాలని నిర్ణయించుకుని, హైదరాబాద్‌కు వెళ్లి బొమ్మ పిస్తోల్, పెద్ద కత్తిని కొనుగోలు చేసి తీసుకొస్తుండగా పట్టుకున్నట్లు సీఐ తెలిపారు. నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చగా.. జడ్జి ఆదేశాల మేరకు రిమాండ్ ఖైదీగా హైదరాబాద్‌లోని చర్లపల్లి జైలుకు తరలించినట్లు పేర్కొన్నారు.

పంట మార్పిడితో అధిక దిగుబడులు

- కంపాసాగర్ కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ శ్రీనివాసరావు సూచనలు



శ్రీనివాసరావు, కేవీకే శాస్త్రవేత్త

త్రిపురారం : ప్రతి సీజన్‌లో ఒకే పంట కాకుండా పంట మార్పిడి చేయడం వల్ల భూసారం పెరిగి అధిక దిగుబడులు సాధించవచ్చని కృషి విజ్ఞాన కేంద్రం కంపాసాగర్ ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాసరావు సూచిస్తున్నారు. ఒకే పంటను ఏళ్ల తరబడి సాగు చేయడం ద్వారా చీడపీడల తాకిడి అధికమవుతుందని, భూమి నిస్సారంగా మారుతుందని చెబుతున్నారు. పంట మార్పిడిపై సలహాలు సూచనలు ఆయన మాటల్లోనే..

ఎంపికలో జాగ్రత్తలు తప్పనిసరి

పంట మార్పిడి చేయాలంటే అంతకు ముందు సాగు చేసిన పంటకు భిన్నంగా పంటను ఎంచుకోవాలి. కొన్ని పంటల వేరు వ్యవస్థ నేలలోని పొరల నుంచి పోషకాలను ఎక్కువగా గ్రహిస్తాయి. పోషకాలను ఎక్కువగా గ్రహించే నువ్వులు, పొద్దుతిరుగుడు, మొక్క జొన్న పంటలకు బదులుగా భూమికి పోషకాలు సమకూర్చే అపరాల పంటలను సాగు చేసుకుంటే మంచి దిగుబడులు వస్తాయి. అపరాల పంటలు కరువు పరిస్థితులను తట్టుకోవడంతోపాటు ఆకులు రాలడం వల్ల భూమికి సేంద్రియ పదార్థాలు అందుతాయి. రాలిన ఆకులను నేలలో కలియదున్నడం వల్ల భూమి సారవంతంగా మారుతుంది. నల్ల రేగడి నేలల్లో సోయా చిక్కుడు వేసుకోవడం వల్ల పైరు కోత సమయానికి ఆకులు పూర్తిగా రాలుతాయి. దీనివల్ల ఒక్కటి నుంచి రెండు టన్నుల సేంద్రీయ పదార్థం లభిస్తుంది.



టమాట పంట

పంట మార్పిడి ఇలా చేసుకోవచ్చు..

- వరి పంటను వరుసగా సాగు చేయకుండా పప్పు ధాన్యాలు, నూనె గింజల పంటలు కూడా సాగు చేసుకోవచ్చు.
- పొద్దు తిరుగుడు పంటను సాగు చేసే వారు జొన్న, సజ్జ, కొర్రలు వంటి చిరు ధాన్యపు పంటలను లేదా కంది, శనగ, మినుము వంటి అపరాల పైర్లు లేదా వేరుశనగతో పంట మార్పిడి చేసుకోవచ్చు.
- వానాకాలంలో వేరుశనగ వేసుకునే రైతులు తరువాత వచ్చే యాసంగిలో మొక్కజొన్న పంట వేసుకుంటే పైరుకు కొంత నత్రజని ఎరువు లభిస్తుంది.
- కంది, శనగ పంటలను వరుసగా సాగు చేస్తే కాయ తొలుచు పురుగు అధికంగా ఉంటుంది. అందువల్ల ఈ పురుగులు తక్కువగా ఆశించే జొన్న, నువ్వులు, మినుము, సోయా చిక్కుడు, ఉలవ, మెట్ట వరి పంటలతో పంట మార్పిడి చేసుకోవాలి.
- వరితో పంట మార్పిడి చేసుకుంటే వేరు శనగ పైరుకు సులిపురుగుల బెడద తగ్గుతుంది.

- మిరప, క్యాబేజీ పంటలకు ఆశించే లద్దె పురుగుల తాకిడి తగ్గాలంటే జొన్న, వరి, సజ్జ, రాగి, పొద్దుతిరుగుడు, వంటి ఆరుతడి పంటలతో పంట మార్పిడి చేయాలి.
- వ్యవసాయ శాస్త్రవేత్తల సలహాల ఆధారంగా పంట మార్పిడి చేయాలి.
- భూసార పరీక్షల ఆధారంగా పంటలకు ఎరువులు వేయడం ఉత్తమం.

- వంగ తోట వేసుకునే రైతులు కాలీఫ్లవర్‌తో పంట మార్పిడి చేసుకుంటే పంటకు ఎండు తెగులు సోకదు.
- టమాట, ఆవాలు, బంతి ధాన్యపు పంటలతో పంట మార్పిడి చేస్తే నులిపురుగుల ఉధృతి తగ్గుతుంది.
- దోస, కాకర, గుమ్మడి పొట్లకాయ, బీర, బూడిద, గుమ్మడి, దొండ వంటి తీగ జాతి కూరగాయల పంటలను వరి పైరుతో పంట మార్పిడి చేసుకోవచ్చు.
- ఉల్లి సాగు చేసేవారు ధాన్యపు పంటలలో పంట మార్పిడి చేసుకోవచ్చు.
- ఒక్కసారి పసుపు పంట సాగు చేసిన వారు రెండేళ్ల పాటు ఆ భూమిలో మరోసారి పసుపు సాగు చేయకూడదు. ఒకవేళ సాగు చేస్తే చీడపీడల ఉధృతి పెరిగి దిగుబడులు తగ్గుతాయి. పసుపు పంట తర్వాత వరి, మొక్క జొన్న వేసుకుంటే నులి పురుగుల ఉధృతి తగ్గుతుంది.